
# దగ్గర కొండలూ నునుపే!

– కె. లక్ష్మి

సాయంత్రం ఆరున్నర దాటింది. 'ఎదురుదాడికి సిద్ధంగా వున్న సిపాయిల్లా బారులు తీరివున్న మెర్క్యురీ లైట్లను చూసి చీకటి రాజు సైన్యం పారిపోయిందా' అన్నట్లు భాగ్యనగరం దీపావళి రాత్రిలా శోభాయమానంగా వుంది. ప్రధాన కూడలి అయిన సుల్తాన్ బజారు ప్రాంతం షాపింగ్ జనంతోబాటు హడావిడిగా ఇళ్లకు చేరే ఆఫీసు పక్షులతో సందులేకుండా కిటకిటలాడుతోంది. సెక్రటేరియట్‌లో పనిచేసే సత్యమూర్తి సంతోష్‌నగర్‌లో వున్న ఇంటికి చేరేందుకు ఉమెన్స్ కాలేజీ దగ్గర వున్న బస్టాపువైపు నడుస్తుంటే ''నమస్కారం సార్'' అన్న మాటలు వినబడి, ఎవర్నోలే అని ముందుకు సాగుతూ, ఆ కంఠం రాజేశ్వరరావుదా అనిపించి, ఆగి మసక వెలుతురులో విద్యానగర్ బస్టాపు దగ్గర నిలబడ్డ జనం వంక చూశారు.



ఆయన ఊహించినట్లుగా ఆ వ్యక్తి రాజు అనబడే రాజేశ్వరరావే. రాజు నాలుగేళ్లక్రితం సెక్రటేరియట్‌లో టైపిస్ట్‌గా పనిచేశాడు. అప్పట్లో సత్యమూర్తి సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసేవారు. రాజు ఆ సెక్షన్‌లోనే పనిచేసేవాడు. తర్వాత ఇన్‌కమ్‌టాక్సు ఇన్‌స్పెక్టరుగా సెలెక్టు అయి అనంతపూర్ వెళ్లిపోయాడు. రాజును సత్యమూర్తి కాంపిటేటివ్ పరీక్షలు వ్రాయడానికి బాగా ఎంకరేజ్ చేసేవారు. టెస్టులు రాయడానికి ప్రిపేర్ అయేందుకు అప్పుడప్పుడు రాజును ఆఫీసుకు వచ్చి సంతకం పెట్టాక పంపేసేవారు. ఆరోజు పనంతా సత్యమూర్తి చూసుకునేవారు.

సత్యమూర్తిగారు ఇచ్చిన ఆ ప్రోత్సాహం, సపోర్ట్ కారణంగానే జీవితంలో ముందుకు రాగలిగేనని రాజు అనుకుంటాడు. అందుకే తన పెళ్లికి శుభలేఖ ఇచ్చి వూరుకోకుండా, సత్యమూర్తి దంపతులను రైలు టికెట్లు బుక్ చేసి తీసుకెళ్లి పట్టుబట్టలు పెట్టాడు.

సత్యమూర్తి రాజును చూసి ''ఏమయ్యా రాజు కులాసానా. ఎప్పుడొచ్చావు?'' అన్నారు.

''కులాసాయే సార్. వచ్చి రెండురోజులయింది. మా పెద్ద బావమరది గృహప్రవేశం ఫంక్షన్‌కని వచ్చాను. మీదగ్గరకు ఎల్లుండి ఆదివారం వద్దామనుకుంటున్నాను. కంగ్రాట్యులేషన్స్ సార్'' అన్నాడు.

సత్యమూర్తి మూడునెలల క్రితమే అసిస్టెంటు సెక్రటరీ అయ్యారు. ప్రమోషన్ వచ్చి చాలా రోజులయినా ఆత్మీయుడి అభినందన అందుకోవడం ఆయనకు సంతోషంగా వుంది.

''సార్ మీ ప్రమోషన్ విషయం నిన్న ఎడ్యుకేషన్‌లో పనిచేసే నాగరాజు చెప్తే తెలిసింది. శ్రమ ఇస్తున్నానని అనుకోకుండా నాలుగు అడుగులు వెనక్కు వేయాలి'' అని రాజు అంటే–

రాజు భుజం మీద చెయ్యివేసి ''నాలుగేం. నాలుగు వందలు వేస్తాను. ఎందుకో చెప్పు'' అన్నారు.


''ఏంలేదు సార్. బాంబే హల్వా దాకా వెళ్లివద్దామని''

''స్వీట్ తీసుకుందామనా. నేను వద్దనను లే కాని ఇవ్వాళ కాదు. ఎల్లుండి మా ఇంటికి వచ్చేటప్పుడు తీసుకురా. నేను ఇప్పుడు అక్కడనుంచే వస్తున్నాను. మా పెద్ద పాప వాణి జెంషెడ్పూరు నుంచి వచ్చింది. దాని పిల్లల కోసమని తీసుకుని వస్తున్నా'' అని కుశల ప్రశ్నలు వేస్తూ, రాజు వెంట ఉమెన్స్ కాలేజీ బస్టాపుకు చేరారు.

అక్కడ బస్సుకోసం ఎదురుచూస్తూ కబుర్లలో సత్యమూర్తి గత వారం రోజులనుంచి మనశ్శాంతి లేకుండా చేస్తున్న కొడుకు న్యూజిలాండు ప్రోగ్రాం గురించి రాజుకు చెప్పారు. వాడికి అనునయంగా చెప్పి ఆ

ప్రోగ్రాం విరమించుకునేట్లు చేయాలని, అందుకోసమయినా, ఆదివారం రావాలని చెప్పి బస్సు ఎక్కారు.

మూడేళ్లలో రిటైరయ్యే సత్యమూర్తికి కుటుంబ బాధ్యతలన్నీ తీరినట్లే. ఆయనకు ఇద్దరు కూతుళ్లు. తర్వాత ఒక కొడుకు. ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లయ్యాయి. కొడుకు వెంకటరమణ సిటీలోనే మూడేళ్ల నుంచి ఉద్యోగం చేస్తున్నాడు. పాతికేళ్లు నిండాయి. ఇంకా పెళ్లికాలేదు. రమణ ఫ్రెండ్స్ కొందరు అమెరికా వెడితే, సత్యమూర్తి భార్య జానకమ్మ కంప్యూటర్స్‌లో బి.టెక్ చేసిన రమణ కూడా వెడితే బాగుంటుందనుకుంది. అయితే రమణ వెళ్లాలని లేదని యం.టెక్ చేసి హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరాడు. రమణ అమెరికా అంటూ అర్రులు చాచనందుకు సత్యమూర్తి సంతోషించారు. ముప్ఫయ్యేళ్లపైన వున్న సర్వీసులో తను తీసుకుంటున్న జీతంకన్నా రమణ నెలజీతం చాలా ఎక్కువ. ఇంతకుమించి ఏం కావాలి. ఇప్పుడు హైదరాబాదు కంప్యూటర్ సిటీగా మారుతోంది అని అనుకున్నారు.



అయితే వారం రోజులక్రితం రమణ తను ఇంకో మూడునెలల్లో న్యూజిలాండు వెడుతున్నానని చెప్పి బాంబు పేల్చాడు. ఏదో రెండు, మూడేళ్లుండి తిరిగి వస్తాడనుకుంటే అక్కడే సెటిల్ అయిపోతానని చెప్పాడు. ఈ వార్త విన్నప్పటినుంచి సత్యమూర్తిగారికి, జానకమ్మకు మనసులో మనసు లేదు. మనదేశంలో ఉద్యోగం దొరక్కపోతే ఎక్కడికో వెళ్లాలి. అట్లాంటిది వున్న వూళ్లో మంచి ఉద్యోగం వుంది. ఇంట్లో మోయవలసిన బరువులు లేవు. స్వంత ఇల్లు వుంది. కడుపులో చల్ల కదలకుండా హాయిగా గడిచిపోతుంటే ఎక్కడికో వెళ్లి సమస్యలు తెచ్చుకోవడమెందుకు నాయనా. దూరపు కొండలు నునుపురా అంటే వినట్లేదు. రాజుని చూసి, అతను చెప్తే విని అయినా బుద్ధి మార్చుకుంటాడేమోనని రాజుకోసం సత్యమూర్తిగారు ఎదురుచూశారు.

• • •

అనుకున్న ఆదివారం వచ్చేసింది. ఆరోజు ప్రొద్దుట తొమ్మిది గంటలకు సత్యమూర్తిగారి ఇంటి ముందు ఆటో ఆగింది. అందులోనుంచి రాజు, అతని భార్య శ్యామల, రెండేళ్ళ కూతురు శిరీష, రాజు తాతయ్య మల్లావధానిగారు దిగారు. అవధానిగారు రాజమండ్రి దగ్గర వున్న ముంగండి నుంచి రాజు వచ్చిన ఫంక్షనుకే వచ్చారు. ఆయనను సత్యమూర్తి లోగడ రాజు పెళ్ళిలో చూసివుండటం వల్ల గుర్తుపట్టారు. అవధానిగారు బాగా చదువుకున్నవారు. మంచి వ్యవహారిక జ్ఞానం వున్నవారు. ఆయనను తీసుకు వచ్చి రాజు మంచిపని చేశాడని అనుకున్నారు.

రాజు వస్తున్నాడని చెప్పడంతోబాటు శెలవు రోజు కావడంతో రమణ ఇంట్లోనే వున్నాడు. పరిచయాలు, కుశల ప్రశ్నలు అయ్యాక కబుర్లు చదువు, వుద్యోగాల మీదకే మళ్ళాయి.

అవధానిగారు రమణతో ''బాబు, నువ్వు కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివావని, న్యూజిలాండు వెడుతున్నావని తెలిసింది. టివిలో క్రికెట్ మాచ్‌లు చూడటం నాకు సరదా. ఆవిధంగా న్యూజిలాండును చూశాను. పొట్ట పోసుకునేందుకు వున్నవూరు వదిలేశాక, దగ్గరలోవున్న బెంగుళూరు అయినా, దూరంగావున్న ఢిల్లీ అయినా, ఇంకా చాలా దూరంగావున్న అమెరికానో, న్యూజిలాండో, ఎక్కడయినా ఒకటే. అయితే నీకు ఆ అవసరం లేదు. ఉన్నవూళ్ళోనే మహారాజులాంటి వుద్యోగముంది. మరి వడ్డించిన విస్తరిలా అక్కడ వున్న జీవితాన్ని, అయినవాళ్ళను వదిలేసి అంతదూరం వెడుతున్నావు'' అని చెప్తుంటే రమణకు నాన్న తన ప్రోగ్రాం విరమించుకోమని చెప్పేందుకు ఈయనను పిలిపించారని అర్థమయింది. అయితే ఈనాటి చదువు, వుద్యోగాల విషయం ఈ ముసలాళ్ళకేం అర్థమవుతాయని అనుకున్నాడు.

రమణ ముఖంలో మార్పును పసిగట్టిన అవధానిగారు ''రమణ నీ ప్రోగ్రాం విరమించుకోమని చెప్పేందుకు నేను రాలేదు. నాకు నీలాగా చదువుకుని బయటికి వెళ్ళే పిల్లల గురించి తెలుసుకోవడం సరదా. నేను హెడ్మాస్టరుగా చేసి రిటైరయ్యాను. ఇక పౌరోహిత్యం చేస్తాను. అంటే నీలాగా పెద్ద పెద్ద వుద్యోగాలు చేసే అబ్బాయిలకు అమ్మాయిలకు పెళ్ళిళ్ళు చేయిస్తాను. అంటే మీ చదువులు వుద్యోగాల విషయాలు చెప్తే తెలుస్తాయన్నమాట.''

మనసులో వూహలు పసిగట్టాడు. ఈ ముసలాయన అఖండుడే అనుకుని రమణ ఏదో చెప్పబోతుంటే అవధానిగారు, ''మామూలుగా యంసెట్ రాంకుతో ఇంజనీరింగ్ కాలేజిల్లో చదివే చదువు క్రికెట్ భాషలో రంజీట్రాఫీ మాచ్ అయితే, నీ ఐ.ఐ.టి.లో చదువు టెస్ట్‌మాచ్ అవునా'' అనగానే రమణ నవ్వుతూ, ''చక్కగా పోల్చారు సార్. అయితే నేను యంటెక్, ఐ.ఐ.టి.లో చేశానుకాని, బి.టెక్ మీరన్న రంజీట్రాఫీ మాచేనండి'' అన్నాడు.

అందరూ నవ్వుకున్నారు. ''సార్ గీర్ ఏవిటి రమణ, తాతగారు అని పిలవ్వయ్యా. నీలాంటి పెళ్ళికొడుకు చెప్పిన మీ ఐ.ఐ.టి జోక్ ఒకటి చెప్పనా, షుగర్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే పంచదార ప్రాడక్టు అయితే, మొలాసస్ బైప్రాడక్టు, చెరకు పిప్పి వేస్ట్ ప్రాడక్టు'' అని అవధానిగారు అంటే-

''అమ్మో తాతగారు మీరు సామాన్యులుకారు'' అని రమణ పెద్దగా నవ్వుతూ, ''ఐ.ఐ.టి.లో డిగ్రీ చేసిన వాళ్ళు ప్రాడక్టు, యంటెక్ చేసినవాళ్ళు బైప్రాడక్టు, డాక్టరేట్ చేసినవాళ్ళు వేస్ట్‌ప్రాడక్టు'' అని పూర్తిచేశాడు.

## పైసల్లో జీతాలు

మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న ఎన్నో దేవాలయ పూజారులకు నెలసరిగా అందే నెల జీతాలు కేవలం పైసలతోనే ఉంటుంది. ఒక పూజారిగారి నెల జీతం 19 పైసలయితే, మరొక పూజారి నెలజీతం 30 పైసలు. ఇంకొక పూజారికి అందే జీతం 50 పైసలు మాత్రమే. ఈ దేవాలయాలలో నిత్యం అర్చనలు చేయటానికి, దేవునికి నైవేద్యం పెట్టటానికి సరిపడే ఫండ్స్‌ను కూడా ఇక్కడి అధికారులు ఇవ్వరు. అంతేకాక దేవాలయాలకు సంబంధించిన స్థలాలను కూడా ఆక్రమించుకునే ఘరానా పెద్దమనుషులు, పూజారుల్ని చంపుతామని బెదిరించి దేవతా విగ్రహాలను దోచుకుపోయే దోపిడి దొంగలు కూడా ఎక్కువగానే ఉన్నారు ఇక్కడ. ఇదే ఇక్కడి పూజారుల జీవితం.

## Assasination-murder

*'Assasination-murder'* అన్న ఈ రెండు ఇంగ్లీషు పదాలకు అర్థం పెద్దతేడా ఏమీలేదు. అయితే రాజకీయ విభేదాలు, మతపరమైన కక్షలు, కార్పణ్యాలు కారణంగా ఒక వ్యక్తి హత్యకు గురయితేదాన్ని **assasination**నూగా అభివర్ణిస్తారు. సాధారణ కారణాలతో ఒకరినొకరు చంపుకోవటాన్ని **murder** అంటారు. ప్రపంచంలో రోజూ మర్డర్స్ ఎన్నో జరుగుతుంటాయి. కానీ అసాసినేషన్స్ చాలా తక్కువగా, చాలా చాలా అరుదుగా జరుగుతుంటాయి. ముఖ్యంగా రాజకీయ ప్రముఖులెవరైనా, రాజకీయ కారణాలతో, మతవైషమ్యాలతో హత్య గావించబడినపుడు అసాసినేషన్ అన్నపదాన్ని ఉపయోగించడం జరుగుతుంది.

- శ్రీకొండ

'ఏవిటీ, చదువులో ఆఖరుమెట్టు డాక్టరేట్. జీవితం ధారపోసి డాక్టరేట్ సంపాదించలేకపోయిన వాళ్ళున్నారు. దాన్ని వేస్ట్ ప్రాడక్టు అంటారా'' అని రాజు విసురుగా అన్నాడు.

''ఒరేయ్ రాజూ. అది అంతేరా. మీ బి.ఏ, బి.కామ్ చదువులు కాదు. ఇంజనీరింగ్ చదువు, అందునా ఐ.ఐ.టి అంటే ఏమిటనుకున్నావు. అందుకే వాళ్ళకు వేలల్లో జీతాలు'' అని రమణవైపు తిరిగి, ''చాల్లేవయ్యా వాళ్ళకు అర్థంకావు. నీకు ఐ.ఐ.టీ.లో చదివిన అమ్మాయిని చూపిస్తా. పెళ్ళి చేసుకుంటావా...'' అన్నారు అవధానిగారు.

''తాతగారు నేను ఇంకా సెటిల్ కావాలి.''


''అయితే ఆ సెటిల్ కావడం ఇక్కడ కాకుండా ఆ న్యూజిలాండులో ఎందుకు పెట్టుకున్నావో...''

''ఈవారం రోజుల్లో ఈ ప్రశ్న చాలామంది వేశారు. అయితే చదువు వుద్యోగాల విషయం మీద మీకు మంచి అవగాహన వుంది కనుక నే చెప్పేది విన్నాక, నేను చేసేపని సరియైనదనిపిస్తే మానాన్నగారిని వొప్పించాలి''

''అమ్మో అన్ని విషయాలు తెలిసిన పెద్ద ఆఫీసరు మీ నాన్న. ఆయనకు నేను చెప్పడమా. అన్నీ తెలుసని, ఈ తాతను ములగచెట్టు ఎక్కించకు. నేను వచ్చింది నిన్ను బుజ్జగించి బుట్టలో వేసుకుని పెళ్ళికొడుకును చేయాలని. అందుకోసమని నువు చెప్పింది వింటాను'' అన్నారు అవధానిగారు.

''తాతగారు నాతో బిటెక్ చదివిన ఫ్రెండ్స్ కొందరు అమెరికా వెడుతుంటే, మా అమ్మ నన్ను కూడా వెళ్ళమంది. అమెరికా వెళ్ళినవాళ్ళకు అక్కడ పర్మినెంట్‌గా సెటిల్ అయేందుకు అవకాశాలు ఇప్పుడు బాగా తక్కువగా వున్నాయి. మూడేళ్ళకో, ఆరేళ్ళకో తిరిగి రావల్సిందే. ఆవిధంగా తిరిగి వస్తాననే మా అమ్మ వెళ్ళమంది. అయితే తిరిగి వచ్చాక ఇక్కడ మళ్ళీ రూట్స్‌కోసం వెతుక్కోవాలి. ఇక, అమెరికాలో లాగా లక్షలు రాకపోయినా, మనదేశంలో కూడా ఇప్పుడు కంప్యూటర్ ఇంజనీర్స్‌కు జీతాలు ఎక్కువే. అందుకే నేను బయటికి వెళ్ళలేదు.''

''మరి అయితే ఇప్పుడెందుకు వెళ్ళాలనుకుంటున్నావు?'' అని సత్యమూర్తి కల్పించుకున్నారు.




''అయ్యో సత్యమూర్తిగారు, మీవాడ్ని చెప్పనీయండి'' అని రమణ వైపు తిరిగి, ''సరే బి.టెక్ అయ్యాక అమెరికా వెళ్ళలేదు. మరి వుద్యోగంలో చేరలేదుగా'' అన్నారు అవధానిగారు.

''మా ఇంజనీరింగ్ కాలేజి కాంపస్ రిక్రూట్‌మెంట్‌లో నేను సెలెక్టు అయ్యాను. తర్వాత నాకు యం.టెక్‌లో చేరేందుకు అవసరమయిన గేట్ పరీక్షలో మంచి రాంకు వచ్చింది. అయినా నేను వుద్యోగంలోనే చేరదామనుకున్నాను. అయితే అప్పుడే వుద్యోగం దేనికి, చదవమని మానాన్న వొత్తిడి చేయడంతో నేను బాంబే ఐ.ఐ.టీ.లో యం.టెక్‌లో చేరాను'' అన్నాడు రమణ.

''మరి ఆరోజు మీనాన్న చేసిన పనివల్ల నీకు మంచే అయిందిగా''

''ఆమాట అడగండి. ఆనాడు పనికొచ్చిన నామాట ఈరోజు పనికిరాకుండా పోయింది. వాడిని యం.టెక్ చదవమని చెప్పి నేను పొరపాటు చేశాను అవధానిగారు''

''సత్యమూర్తిగారు, మీరు అట్లా అనుకోకూడదు. అతను చెప్పేదేమిటో విందాం'' అని రమణ వైపు తిరిగి, ''తర్వాత చెప్పు...'' అన్నారు అవధానిగారు.

''తాతగారు- అక్కడ నేను ఋషులను చూశాను. అక్కడి ప్రొఫెసర్లలో కొందరికి అమెరికాలో పెద్ద జీతాలతో ఆఫర్స్ వున్నా, విద్యాదానం చేయాలని ఇక్కడే వుండిపోయారు. వాళ్ళను చూసి నాకు కూడా డాక్టరేట్ చేసి అక్కడే వుండిపోవాలనిపించింది. అయితే కాంపస్ సెలెక్షన్‌లో ఇక్కడ జాబ్ వచ్చేసరికి, డాక్టరేట్ ఆలోచన వదిలేసి జాబ్‌లో చేరాను.''

''అయితే ఇక్కడ జాబ్ రాకపోతే బొంబాయిలోనే వుండి డాక్టరేట్ చేసేవాడివి. ఇక్కడ జాబ్ వచ్చాక డాక్టరేట్ చేసే ఆలోచన వదిలేశావుకదా. ఇప్పుడు న్యూజిలాండ్ వెళ్ళి డాక్టరేట్ చేస్తావని రాజు చెప్పాడు''

''అవును. అక్కడ కంపెనీలో జాబ్ చేస్తూ డాక్టరేట్ చేయవచ్చని''

''బాగానే వుంది. మూడు నాలుగేళ్ళుండి డాక్టరేట్ చేసిరా. మరి అక్కడ సెటిల్ అవడమెందుకు''

''అక్కడ సెటిల్ అయ్యే అవకాశముందనే అసలు న్యూజిలాండు వెళ్లేది. ఇక్కడ ప్రయివేటు జాబ్స్‌లో ఉద్యోగ భద్రత వుండదని మా నాన్నగారు అన్నారు. అక్కడ ఆ ప్రాబ్లమ్ వుండదు''

''అవధానిగారు నే చెప్పిన మాటకు వక్రభాష్యం చెప్తున్నాడు. నేను చెప్పినదేమంటే, ఎన్నివేలు వచ్చినా ప్రయివేటు ఉద్యోగాల్లో అంత జాబ్ సెక్యూరిటీ వుండదు. గవర్నమెంటులో ఈమధ్య జీతాలు బాగా పెరిగాయి. అందుచేత సివిల్ సర్వీసుకుగాని ఇంజనీరింగు సర్వీసుకుగాని పరీక్షలు వ్రాయమన్నాను. దానికి వాడు ఆసక్తి చూపలేదు. పోనీలే వాడిష్టమని నేను వూరుకున్నాను''

''మా నాన్న మాటకు నేనేమీ వక్రభాష్యం చెయ్యటంలేదు. నేను బ్రయిటే కాని బ్రిలియంట్ కాదు. అందుచేత ఎంత కష్టపడ్డా సివిల్ సర్వీసుకు సెలెక్టు కావడం కష్టం. అయినా సివిల్ సర్వీసు అంత స్మూత్‌గా సాగిపోతుందని నమ్మకం లేదు. అందుకే అటువైపు ఇంట్రస్ట్ చూపలేదు'' అన్నాడు.

''సత్యమూర్తిగారు పరిపాలనా వ్యవస్థకు గుండెకాయ లాంటి సెక్రటేరియట్‌లో వున్నారు. సివిల్ సర్వీ

సులో వున్న సమస్యలు మీకే తెలియాలి'' అన్నారు అవధానిగారు.

''మావాడు చెప్పేదేమిటో నాకు అర్థంకాలేదు అవధానిగారు. ఉద్యోగం అన్న తర్వాత ఎక్కడయినా ఆటుపోటులుంటాయి. సర్దుకుపోవాలి. ఆయనెవరో పదేళ్లు ఐ.ఎ.ఎస్ ఆఫీసరుగా పనిచేసి, నచ్చక బయటికి వచ్చాడట. ఆయన లెక్చర్‌లో చెప్పిన మాటలే నిజమని మావాడు అనుకుంటున్నాడు. గవర్నమెంటు సర్వీసులో వర్క్ కల్చర్ లేదంటాడు''

''సత్యమూర్తిగారు బడిపంతులు చేసి రిటైరయి పల్లెటూళ్లో వుంటున్నవాడ్ని నాకేం తెలుస్తుందికాని, గవర్నమెంటు సెక్టర్‌లో నడుస్తున్న పరిశ్రమల్లో ఎక్కువ భాగం నష్టాల్లో నడుస్తున్నాయని, కొన్ని మూతపడ్డాయని, మరికొన్ని ప్రయివేటువాళ్లకే అప్పగించారని పేపర్లో చదివాను''

''నే చెప్పేది అదే. ప్రయివేటు సెక్టర్‌లో ఏ స్థాయిలో నయినా వర్క్‌నుబట్టి రెమ్యూనరేషన్ వర్క్ చేయకుండా పైకి వెళ్లడం సంగతటుంచి, అసలు సర్వయివల్ వుండదు. ఒకప్పుడు ఏమోగాని, ఈనాడు మనదేశంలో టోటల్ ఎంప్లాయిమెంటులో ప్రయివేటు సెక్టర్ షేరు ఎక్కడ''

'గవర్నమెంటు సెక్టర్ అంటే పాలనా యంత్రాంగం లేకపోతే అసలు దేశమే వుండదు' అని రాజు చెప్పాలనుకున్నాడు కాని, రమణ మాటలు పూర్తవుతూనే అవధానిగారు ''మరి ఉద్యోగాలలో రిజర్వేషన్స్ గురించి చెప్పు రమణ'' అన్నారు.

''ఉద్యోగ రంగంలో రిజర్వేషన్ అనేది గవర్నమెంటు సెక్టలో మాత్రమే వుంది. టోటల్ ఎంప్లాయిమెంట్‌లో ఎక్కువ భాగం ప్రయివేటు సెక్టార్‌లో వుండటం వల్ల రిజర్వేషన్ లేని వర్గాల ఉద్యోగావకాశాలు తగ్గలేదు. నామటుకు నేను ప్రయివేటు సెక్టరులో పనిచేయక తప్పదు అనేకంటే చేసే పనికి తగిన రెమ్యూనరేషన్, గుర్తింపు, లిఫ్ట్ లభిస్తాయి కనుక ప్రయివేటు సెక్టారే బెటర్ అనుకుంటాను.''

''రిజర్వేషన్ గురించి సరిగ్గా చెప్పాలోయ్ రమణ. నన్నడిగితే రిజర్వేషన్స్ వచ్చాకనే చదువులో పోటీ పెరిగి, మెరిట్ స్టూడెంట్స్ శాతం బాగా పెరిగింది. అమెరికాలో మొదలెట్టి నువ్వు వెళ్లాలనుకుంటున్న న్యూజిలాండుతోసహా వర్ధమాన దేశాలన్నీ ఈ మెరిట్ స్టూడెంట్స్‌కు సాదరంగా స్వాగతం పలుకుతున్నాయి'' అని అవధానిగారు చెప్తుంటే రాజు ఆయన వంక ఇబ్బందిగా చూశాడు.

అయితే అవధానిగారి మాటలు రమణకు సంతోషం కలిగించాయి ''నాలుగునెలల క్రితం వరకు బయటికి వెళ్లాలనే ఆలోచన నాకులేదు. ఒకవేళ కంప్యూటర్ రంగంలో స్లంప్ వచ్చినా, ప్రాబ్లమ్స్ రాకుండా మానేజ్‌మెంట్‌సైడ్ మారడానిక్, ఇక్కడికి వచ్చాక యం.బి.ఎ చేశాను. నాలుగు నెలలక్రితం బెంగుళూరులో కంప్యూటర్స్ మీద జరిగిన ఇంటర్నేషనల్ సెమినార్‌లో ఒక పేపర్ ప్రజంటు చేశాను. ఆ పేపరు నచ్చిన న్యూజిలాండ్ డెలిగేట్, నన్ను న్యూజిలాండు వచ్చి వాళ్ల కంపెనీలో చేరమని ఆహ్వానించాడు. తర్వాత కబుర్లలో ఫేకల్టీలో జాయిన్ అవవచ్చని చెప్పారు.''

రాజు కల్పించుకుని ''ఆ పని అమెరికా వెళ్లి చేయవచ్చును కదా'' అన్నాడు.

''చేయవచ్చునుకాని పోటీ ఎక్కువ. ఇక న్యూజిలాండులో అయితే సిటిజన్‌షిప్ లభిస్తుంది కనుక మా నాన్న ఆశించినట్లుగా చేరబోయే జాబ్‌లో సెటిల్ కావచ్చు. ఇక ఇండియాలో కాని, అమెరికాలో కాని పొందలేని గుర్తింపు న్యూజిలాండులో లభిస్తుంది. అందుచేత అక్కడకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాను. మా నాన్న అంతదూరం వెళ్లడం దేనికిరా అంటున్నారు. ఉండటానికి చాలా దూరమయినా, అక్కడనుండి ఇక్కడకు వచ్చేది విమానంలో కాబట్టి ప్రయాణానికి పదిగంటలు పడుతుందేమో. రాజోలు దగ్గర వున్న మా తాతగారి వూరుకు ఇక్కడనుంచి వెళ్లడానికి అంతకంటే ఎక్కువ పడుతుంది.''

''అవధానిగారు, మావాడికి వేల మైళ్ల దూరంలో వున్న పరాయిదేశం, ప్రక్కనే వున్న రాజోలు ఒకటయ్యాయి'' అన్నారు.


''నిజమే కదండి. ఋషులు దివ్యదృష్టితో ఎక్కడో జరిగేవి చూడగలిగేవారని చదివేవాళ్లం. మరి ఈనాడు ఎన్నో వేలమైళ్ల దూరంలో వున్న ఇంగ్లాండులోనో, మరెక్కడో ఆడే క్రికెట్ మాచ్‌ని ఆడేటప్పుడే టి.విలో చూస్తున్నామా లేదా. అట్లాగే ఆనాడు దేవతలు తిరిగారని చెప్పుకునే విమానాలు, ఇప్పుడు మనకు అందుబాటులో వున్నాయి కదా. మనం వెనక్కు తవ్వుకుంటూపోతే తెల్లవాడు మనదేశాన్ని పాలిస్తున్న రోజుల్లో కలెక్టరు ఇంగ్లాండు నుంచి నాలుగైదు నెలలు ఓడ ప్రయాణం చేసి కాకినాడ వచ్చేవాడట'' అని చెప్తుంటే-

రాజు ఇక వూరుకోలేక ''తాతయ్యా నువ్వు ఆ అబ్బాయికి నచ్చచెప్తానని బయలుదేరి వచ్చి, ఇట్లా మాట్లాడటం బాగాలేదు'' అన్నాడు.

''అవున్రా నచ్చచెప్పాలనే వచ్చాను. ఆ వయసు కుర్రాళ్లలో వుండే ఆవేశం, దుడుకుతనం రమణలో లేవు. ఎందుకు వెళ్లాలనుకుంటున్నాడో చాలా క్లియర్‌గా చెప్పాడు. అతను చెప్పింది విన్నాక, అతను చేసే పని సరియైనదే అనిపిస్తోంది'' అని అవధానిగారు సత్యమూర్తిగారి వైపు తిరిగి-

''అయ్యా అలనాడు దశరథ మహారాజు నలుగురు కొడుకులలో ఒకడయిన రాముడి ఎడబాటునే సహించలేకపోయాడు. ఒక్కగానొక్క కొడుకు తండ్రిగా మీ బాధను అర్థం చేసుకోగ

## అమీర్ షూటింగ్






అభిమానుల రద్దీని ఎదుర్కొనడంకోసం అమీర్‌ఖాన్ రివాల్వర్ కొన్నాడు. అందాజ్ అప్నా అప్నా షూటింగ్ సమయంలో గలాటా జరిగిన తర్వాత కొన్నాడు ఆ రివాల్వర్‌ని.

## రియల్ విలన్

తెరపై విలన్‌గా నటించే మహేష్ ఆనంద్ తన పొరుగునే వుంటున్న అన్నాథిల్లాన్ అనే ఎయిర్ హోస్టెస్‌ను రేప్ చేయబోయాట్ట. మహేష్‌ఆనంద్ మరో 12 మంది మిత్రులతో కల్సి అన్నా తలుపుకొట్టి ఆమె తలుపు తీయగానే మీదపడి రేప్ చేయబోయాడుట. అదృష్టవశాత్తు ఆమె పెనుగులాడి తప్పించుకుని స్టేషన్‌కి చేరి రిపోర్టు ఇచ్చిందిట.

- డి. సత్యమూర్తి





## కాపురం

''మీ పిసినారితనం మండిపోనూ, ఇక మీతో కాపురం చేయలేను. ఉరితీసుకొని చచ్చిపోతాను'' అరిచింది భార్య.

''ఉరితాడు మాత్రం డబ్బులిచ్చి కొనకు. ఇంట్లో అటకమీద వుంది.'' చెప్పాడు భర్త.

- సిహెచ్.వి.వి.ఎస్.మూర్తి (కొమరగిరిపట్నం)

## కల

''మీరు ఎక్స్‌పోజింగ్‌కి పూర్తిగా వ్యతిరేకినని చెప్పి, మీ తొలి చిత్రంలోనే బాగా ఎక్స్‌పోజ్ చేశారెందుకు?'' అడిగాడు సినీవిలేఖరి.

''ఓహ్... అదా! నేను ఎక్స్‌పోజ్ చేస్తే ఎలా వుంటానోనని ఆ సినిమాలో హీరో కలగంటాడు. అంతే!'' చెప్పింది నటి శ్రీవాణి.

- పి.వి.సుజాతారాయుడు (జె.జె.నగర్)


## పోస్టుమార్టం

ఈశవాన్ని పోస్టుమార్టం చేసినపుడు పడిన కష్టం ఇంతకు ముందెన్నడూ పడలేదు తెల్సా?'' అని చెప్పాడు డాక్టర్ పిచ్చయ్య.

''అలాగా ఎందుకంత కష్టం?'' అడిగాడు తోటి డాక్టరు.

''పోస్టుమార్టం చేసినపుడు మనిషి కదిలిపోతుంటే చేయలేక చేయలేక చచ్చాననుకో'' చెప్పాడు డాక్టర్ పిచ్చయ్య.

- కృష్ణవేణి.ఎన్ (ఆళ్లగడ్డ)




లను. కాని మన అనుబంధాలు ఆప్యాయతలు పిల్లల బంగారు భవిష్యత్తుకు అడ్డుగోడ కాకూడదు.''

''అవధానిగారు వాడి భవిష్యత్తుకు నేను అడ్డుగోడ నవుతానా. వాడే చెప్పాడుగా యం.టెక్‌లో చేరమని ప్రోత్సహించింది నేనేనని. ఇప్పుడు డాక్టరేట్ చేద్దామని వుంటే ఇక్కడే ఐ.ఐ.టిలో చేసుకోమనండి.''

''మీవాడి వ్యూపాయింటు మీరు అర్థం చేసుకోలేదని పిస్తుంది. డాక్టరేట్ చేయాలని మాత్రమే అనుకుని వుంటే ఉద్యోగంలో చేరకుండా అప్పుడే మొదలెట్టే వాడు. బయటికి వెళ్లాలనుకుని వుంటే యం.టెక్‌లో చేరకుండానే అమెరికా వెళ్లేవాడు. ఏం రమణా''

''అవును తాతగారు మీరు సరిగ్గా చెప్పారు. నా క్వాలిఫికేషన్, ఎక్స్‌పీరియన్స్, దానితోబాటుగా పేపరు ప్రజెంటు చేయడంలో నేను చూపిన ఎకడమిక్ ఇంటరెస్ట్ కారణంగా ఈ ఆఫర్ వచ్చింది''

''చూశారా సత్యమూర్తిగారు. జరిగిందది. హాయిగా వెళ్లనివ్వండి. అంతా బాగుంటే సెటిల్ అవుతాడు. లేకపోతే డాక్టరేట్ చేసి వచ్చేస్తాడు'' అన్నారు అవధానిగారు.

''కాని...'' అని సత్యమూర్తిగారు చెప్పబోతే ''అయ్యా ఇంకా అనుమానాలేనా. జీవితంలో సాహసవంతమయిన నిర్ణయాలు తీసుకోవలసిన సమయంలో, ఏ కారణంగా వెనక్కు తగ్గినా మళ్లీ ఆ అవకాశం రాదు.

ఒకవేళ వచ్చినా దాని ఫలం పొందే వయస్సు దాటిపోయింది. నే చెప్పేది నాగురించే. అరవయి ఏళ్లనాటి విషయం. మా నాయనగారికి నేను ఒక్కడ్నే కొడుకుని. యస్.యస్.యల్.సి క్లాసులో మా బెంచీలో కూర్చునే ముగ్గురులో పబ్లిక్ పరీక్షలో నాకే ఎక్కువ మార్కులు వచ్చాయి. అప్పట్లో కోనసీమలో తహసీల్దార్లు గవర్నమెంటు లాంచీలో పర్యటనకు వచ్చేవారు. ఆ విధంగా తహసీల్దారు గవర్నమెంటు లాంచీలో తిరగాలని అనుకునేవాడిని. అందుకోసమని కాకినాడ వెళ్లి ఇంటర్ చదువుదామనుకున్నాను. మా నాన్న వీల్లేదన్నాడు. అప్పట్లో గాంధీగారి నిరాహార దీక్షల గురించి పేపర్లో చదివేవాళ్లం.

నేను అట్లాగే ఇంటర్‌లో చేర్పించమని నిరాహారదీక్షలో కూర్చున్నాను. మా నాన్న కూడా పచ్చి మంచి నీళ్లు ముట్టలేదు. నేను అన్నం తినకపోతే గోదాట్లో దూకి చస్తానని బయల్దేరాడు. మా అమ్మ, మామయ్య బ్రతిమాలడంతో నేను అన్నం తినక తప్పలేదు. మా నాన్న నన్ను టీచర్ ట్రయినింగ్‌లో చేర్పించాడు. ఆ విధంగా నేను స్కూలు మాస్టరనై ఉండిపో

యాను.''

''మరి ఇక్కడ సారు వాళ్లబ్బాయి చదువుకోడానికి అడ్డం పెట్టలేదు అంటే...''

''రాజు నువ్వూరుకో. అవధానిగారు మీకు చాలా అన్యాయం జరిగింది'' సత్యమూర్తి అన్నాడు.

''నాకు ఇంతే ప్రాప్తం అనుకున్నాను. నాగురించి కాదు. నా బెంచ్‌మేట్స్ సూరి, శేషుల గురించి మీరు వినాలి. వాళ్లిద్దరు కాకినాడ వెళ్లి డిగ్రీ చేసి, ఆ తర్వాత యం.ఎ కూడా చేశారు. అప్పట్లో కాలేజీలు చాలా తక్కువ. నెల్లూరులో వున్న కాలేజీలో శేషు ట్యూటర్‌గా చేరి ప్రిన్సిపాల్‌గా రిటైరయ్యాడు'' అని చెప్పారు అవధానిగారు.

''నిజమే తాతయ్యా మంచి పొజిషన్‌లోకి వచ్చారు'' అని రాజు అంటే–

''పూర్తిగా వినరా రాజు. సూరి ఇప్పుడు రమణలాగా సాహసం చేశాడు.

ఢిల్లీకిపైన వున్న సిమ్లాలో సెంట్రల్ సెక్రటేరియట్‌లో చేరాడు. ఆరోజుల్లో ముంగండ నుంచి అంచెలంచెలుగా సిమ్లా చేరేసరికి వారం రోజులు పట్టేది. అందుకే అప్పట్లో నెల్లూరులో చేరిన శేషు తెలివైనవాడనుకున్నాం. కాని సిమ్లాలో చేరిన సూరి సెంట్రల్ సెక్రటేరియట్‌లో జాయింట్ సెక్రటరీగా రిటైరయ్యాడు'' అని అవధానిగారు చెప్పగానే విన్నవాళ్లందరు నిశ్చేష్టులయ్యారు.

సత్యమూర్తి లేచి అవధానిగారి దగ్గరకు వెళ్లి చేతులు పట్టుకుని ''మీగురించి చెప్పింది వింటుంటే చాలా బాధగా వుంది. నేను ఎంతసేపు మావాడు ఎక్కడికో దేశంకాని దేశం ఎందుకు వెళ్లాలి అని చూశానేకాని, మీరిందాక అన్నట్లు వాడి భవిష్యత్తుకు సంకెళ్లు వేస్తున్నానని గ్రహించలేదు. నా కళ్లు తెరిపించారు. ఇప్పుడు మీరు చెప్పిన సూరిగారి సాహసం ముందర నే చేసిందేముంది కాని, ఆరోజుల్లో ఉద్యోగం కోసం నేను హైదరాబాద్ రావడం తెగింపే. ఇక్కడకు వచ్చిన నేను అసిస్టెంటు సెక్రటరీనయితే, అక్కడే వుండిపోయి తాలూకాఫీసులో, కోర్టులో చేరిన నా సహాధ్యాయులు ఇంకా గుమాస్తాలుగానే వున్నారు.''

''చూశారా సత్యమూర్తిగారు మీలో వున్న తెగింపే మీ రమణకు వచ్చింది'' అన్నారు.

సత్యమూర్తిగారు రమణ వంక ఆప్యాయంగా చూస్తూ అవధానిగారి దగ్గరకు తీసుకువచ్చాడు. రమణ అవధానిగారికి పాదాభివందనం చేశాడు. అవధానిగారు రమణను మనసారా ఆశీర్వదించి, ''రమణ నువ్వు న్యూజిలాండు వెళ్లేలోగా పెళ్లి చేసుకుని, నీ భార్యను తీసుకుని అక్కడకు వెళ్లు. అప్పుడు మీ అమ్మ, నాన్నలకు నువ్వు ఏం తింటున్నావో, ఏం చేస్తున్నావో అన్న దిగులు తగ్గుతుంది'' అన్నారు. రమణ ఇష్టంగా తల వూపాడు.

★